సాక్షి సూర్యాపేట

సోమవారం । 7 । జూలై । 2025



చోరీలకు పాల్పడుతున్న..

చోరీలకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను ఆదివారం నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



కల సాకారమయ్యేనా..?

ఉమ్మడి జిల్లాలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ కలగానే మిగిలిపోతోంది. - 8లో



వేదాలకు నిలయంగా..

వేదాలకు నిలయంగా ఉండాలని యాద గిరిగుట్టలో వేద పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు విప్ ఐలయ్య అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

దేశవ్యాప్త సమ్మెకు సీపీఐ మద్దతు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట అర్బన్ : ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్వహించనున్న సమ్మెకు సీపీఐ మద్దతు ఉంటుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను మార్చి 8 గంటల పని విధానాన్ని ఎత్తివేసి కార్మికుల సమ్మె హక్కును కాల రాసే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలన్నారు. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చటం సరికాదన్నారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సూర్యాపేట జిల్లా పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి యువజన సంఘ నాయకులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు బూర సైదులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేయొద్దు

సూర్యాపేటటౌన్ : మద్యం మత్తులో డ్రైవింగ్ చేయొద్దని ఎస్పీ కె.నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 1509 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో 15 మందికి జైలు శిక్షలు పడగా మొత్తం కేసుల్లో రూ.5 లక్షల41వేలు జరిమానా కట్టినట్లు పేర్కొన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపిన సూర్యాపేట డివిజన్ పరిధిలో 957 కేసులు, కోదాడ డివిజన్ పరిధిలో 552 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

జిల్లా ఆర్యవైశ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా రాజా



నియామకపత్రం అందజేస్తున్న వెంపటి వెంకటేశ్వరావు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : జిల్లా ఆర్యవైశ్య మహాసభ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా సూర్యాపేటకు చెందిన బండారు రాజా నియామకమయ్యారు. ఈమేరకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు, మాజీ కార్యదర్శి గరినే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న టీపీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేస్తూ పీఆర్సీని అమలు చేయాలని టీపీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మల శ్రీనివాస్, కడపర్తి శ్రీనివాస్ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీపీటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లతో పాటు జీరో సర్వీస్‌తో బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయ పోస్టు ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎనుగుతల రమేష్, రాష్ట్ర సహాధ్యక్షులు బచ్చుపల్లి శంకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ముంత శ్రీనివాస్, బత్తుల ఉపేందర్, సోమగాని రమేష్, వీసావరం శ్రీనివాసరెడ్డి, బుర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్‌పై అలసత్వం

మున్సిపాలిటీల్లో నత్తనడకన అమృత్ 2.0 పనులు

- పునాది దశలోనే వాటర్ ట్యాంకుల నిర్మాణం
- ప్రారంభం కాని పైప్‌లైన్ పనులు
- 2026 మార్చి నెలాఖరు వరకు గడువు

మున్సిపాలిటీల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 జూలైలో అమృత్ 2.0 పథకం తీసుకువచ్చాయి. ఈమేరకు వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. 2026 మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే మున్సిపాలిటీల్లో ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాటర్ ట్యాంకు పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయి.



నేరేడుచర్ల మున్సిపాలిటీలోని పద్మావతి వెంచర్ వద్ద బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న వాటర్ ట్యాంకు

బేస్‌మెంట్, పిల్లర్ల దశలో పనులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీకి అమృత్ 2.0 పనుల నిమిత్తం రూ.11 కోట్లు మంజూరయ్యాయి. పట్టణంలోని మూడు ప్రాంతాలైన పద్మావతి వెంచర్ వద్ద నిర్మించే వాటర్ ట్యాంకు ప్రస్తుతం బేస్మెంట్ లెవల్‌లో పనులు జరుగుతున్నాయి. ఎస్‌కేఎస్ ఫంక్షన్‌హాల్ వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు పిల్లర్ల దశలో ఉంది. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వాటర్ ట్యాంకు రూఫ్ లెవల్‌లో ఉంది. ఈ మూడు ట్యాంకులకు పైపులైన్లు ఐదు కిలో మీటర్ల మేరకు పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు కూడా ప్రారంభం కాలేదు. మూడు వాటర్ ట్యాంకుల నుంచి మున్సిపాలిటీలోని 15 వార్డులకు నీటిని అందించేందుకు ఈ పనులు చేపడుతున్నారు. వీటి ద్వారా పూర్తి స్థాయిలో మంచినీటిని అందించనున్నారు. అదే విధంగా మురుగునీటి శుద్ధి(ఎస్‌టీపీ) ప్లాంటు, చెరువుల పునరుద్ధరణకు నిధులు మంజూరు అయినప్పటికీ టెండర్లు పూర్తికాకపోవడంతో పనులు నేటికీ ప్రారంభం కాలేదు.



నేరేడుచర్లలో ఎస్‌కేఎస్ ఫంక్షన్‌హాల్ వద్ద నిర్మాణ దశలో ఉన్న వాటర్ ట్యాంకు

మూడు చోట్ల మాత్రమే పనులు ప్రారంభం

కోదాడ: అమృత్ 2.0 పథకం కింద కోదాడ మున్సిపాలిటీలో కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్ల 80 లక్షలను మంజూరు చేసింది. మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను తీర్చడానికి ఈ నిధులతో ప్రస్తుతం మూడు చోట్ల వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణానికి ప్రజారోగ్యశాఖ అధికారులు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. పట్టణంలో 3 కేఎల్, 5 కేఎల్, 7 కేఎల్ కెపాసిటీ గల ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులన్నీ పునాది దశలోనే ఉన్నాయి. మున్సిపాలిటీకి సంబంధం లేకుండా ప్రజారోగ్యశాఖ అధికారులు పనులు చేస్తుండడంతో పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ట్యాంకుల నిర్మాణం పూర్తయిన తరువాత దానికి అనుబంధంగా పైప్‌లైన్ పనులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలో పనులను వేగవంతం చేస్తామని ప్రజారోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.

నిర్మాణ దశలోనే..



తిరుమలగిరి మున్సిపాలిటీలో పిల్లర్ల దశలో ఉన్న వాటర్ ట్యాంక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : అమృత్ 2.0 కింద 2 సంవత్సరాల క్రితం తిరుమలగిరి మున్సిపాలిటీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం, నీటి సరఫరా, అంతర్గత పైప్‌లైన్ నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించారు. 2024 మార్చిలో ఈ పనులు చేపట్టారు. మున్సిపాలిటీలో మొత్తం 5 వాటర్ ట్యాంకుల నిర్మాణాలకుగాను ప్రస్తుతం మూడు ట్యాంకు నిర్మాణాలు ప్రారంభించారు. మున్సిపాలిటీలోని సంత ఆవరణలో, ప్రభుత్వ ఆస్పత్రి పక్కన, మోత్కూరు రోడ్డు పక్కన వాటర్ ట్యాంకు నిర్మాణాలను చేపట్టారు. సంతలో చేపట్టిన పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రస్తుతం 25 శాతం మేర పూర్తయ్యాయి. మిగతా రెండు చోట్లా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పైప్‌లైన్ నిర్మాణ పనులు ఎక్కడా చేపట్టలేదు.

25 శాతం పనులే పూర్తి

సూర్యాపేట అర్బన్ : అమృత్ 2.0లో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీలో రూ.316 కోట్ల అంచనా వ్యయంతో 295 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టారు. కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వారు టెండర్ దక్కించుకొని పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం 25 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. ఈ నిర్మాణ సంస్థ వారే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తి అయిపోయిన తర్వాత రోడ్లను కూడా మరమ్మతులు చేసే విధంగా టెండర్‌లో ఉంది.

డ్రెయినేజీ పేరుతో రోడ్లు ధ్వంసం

సూర్యాపేట మున్సిపాలిటీలో అమృత్ 2.0 కింద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం రోడ్లన్నీ తవ్వేస్తున్నారు. పనులు పూర్తికాకపోవడంతో కాలనీ వాసుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. మొదటగా రోడ్డు మధ్యలో ప్రాంతాన్ని నిర్ణయించి హోల్స్ పెట్టేది ఒకరు, పెట్టిన హోల్స్ ప్రకారం రోడ్డును రెండుగా చీల్చేది మరొకరు, తదుపరి పైపులు వేసే వారు తర్వాత అక్కడ నిర్మించాల్సిన మ్యాన్‌హోల్స్‌కు మార్కింగ్ ఇస్తూ కట్టేవారు మరొకరు. ఈ ముగ్గురి మధ్యన మూడు ముక్కలాటగా రోడ్డు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. అసలే వర్షాకాలం. అందులోనూ అన్ని రోడ్లన్నీ తవ్వి ఉండటంతో ఈ రోడ్ల ప్రయాణం సాగించాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు.



బాలాజీ నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలో భాగంగా తవ్వుతున్న రోడ్డు

ఇబ్బందులు పడుతున్నాం



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో రోడ్లన్నీ పగలగొట్టారు. పనులు పూర్తి చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. బయటికి వెళ్లాలంటే ఏ గుంటలో పడతామోనని భయంగా ఉంది. వెంటనే పనులు పూర్తి చేయాలి.

– కనకటి రవి

యూరియా ఎమ్మార్పీకి విక్రయిస్తాం

- ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో సమావేశమైన జిల్లా వ్యవసాయశాఖాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కోదాడ: హోల్‌సేల్ డీలర్లు తమ వద్ద ఎక్కువ ధర తీసుకుంటున్నారని వారిపై నిరసనగా తాము యూరియా అమ్మొద్దని నిర్ణయించుకున్నామని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని అధికారులు చెప్పిన విధంగా సోమవారం నుంచి యూరియా ఎమ్మార్పీకి అమ్ముతామని డీలర్లు తెలిపారు. ఆదివారం 'ఎమ్మార్పీకి అమ్మలేం' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి స్పందించారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం కోదాడలోని వర్తక సంఘం కార్యాలయంలో కోదాడ, మునగాల ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, ఈ విషయంలో రైతులు అధైర్యపడొద్దన్నారు. డీలర్లు, దుకాణదారులు యథావిధిగా యూరియా అమ్మకాలు చేస్తారని, అలా చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు కావాలనే రైతులను తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారం చేశారని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సోమవారం నుంచి ఎమ్మార్పీకే యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. యూరియాను బ్లాక్ చేసినా, అధిక ధరకు అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో పాటు పలువురు ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘంలో అక్రమాలు

- సంఘానికి సంబంధించి పొదుపు డబ్బులు మాయం కావడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు
- వీఓఏ రూ.10వేలు వాడుకున్నట్లు విచారణలో వెల్లడి
- రికవరీకి ఆదేశించిన డీపీఎం



పాలకవీడులోని మహిళా సమాఖ్య కార్యాలయం

పాలకవీడు: పాలకవీడు మండలం ముసిఒడ్డుసింగారం గ్రామ పరిధి రోళ్లవారిగూడెం గ్రామంలోని దిల్వాలా మహిళా సంఘంలో అక్రమాలు వెలుగు చూశాయి. ఖాతాలోని పొదుపు డబ్బులు మాయం కావడంతో సంఘం సభ్యులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వీఓఏ రూ.10వేలు వాడుకున్నట్లు తేలడంతో విచారణకు ఆదేశించారు.

కనిపించని 11 ఏళ్ల పొదుపు డబ్బు

గ్రామంలోని దిల్వాలా సంఘం మహిళలు గత 11 సంవత్సరాలుగా ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున పొదుపు చేస్తూ వచ్చారు. అయితే వారి ఖాతాలో పొదుపు డబ్బులు రూ.లక్షా పదివేలు మాయమయ్యాయి. అంతేకాకుండా రూ.2లక్షల లోన్ తీసుకోకున్నా తీసుకున్నట్లు చూపిస్తోందని గత 20 రోజుల క్రితం సంఘం సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతస్థాయి కమిటీ వేసి నిజానిజాలు తేల్చాలని కోరారు. ఈమేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో డీపీఎం విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా లోన్ విషయంలో వీఓఏ రూ.10వేలు అక్రమంగా వాడుకున్నట్లు తేల్చి రికవరీకి ఆదేశించారు.

మినిట్స్ బుక్‌లో తప్పుగా నమోదు

మినిట్స్ బుక్‌లో వాస్తవిక లావాదేవీలకు భిన్నంగా డేటాను నమోదు చేస్తున్నారని, అప్పు పూర్తిగా చెల్లించినా ఇంకా మిగిలిందంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ సంఘం సభ్యులు వాపోతున్నారు. వీఓఏ సంఘం సభ్యులను సంప్రదించకుండానే తీర్మానాలు రాస్తున్నారని ఆరోపిస్తున్నారు. అదే విధంగా సీఐఎఫ్, శ్రీనిధి, ఎస్‌బీ ఇలా అన్ని రకాల రుణాల్లో అక్రమాలు జరిగినట్లు సభ్యులు పేర్కొంటున్నారు. అసలు ఇన్ని అక్రమాలు జరుగుతున్నా విచారణకు వచ్చిన అధికారులు అవేమీ తేల్చకుండా నామమాత్రపు విచారణ చేపట్టి చేతులు దులుపుకున్నారని వాపోయారు. ఈమేరకు గత సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

విచారణ పూర్తయింది

మహిళా సంఘాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న సభ్యులు ఎవరైనా అవినీతికి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ముసిఒడ్డు సింగారం గ్రామ పరిధి రోళ్లవారిగూడెంలోని దిల్వాలా సంఘంలో అవకతవకలు జరగడంపై ఇటీవల డీపీఎం ఇటీవల విచారణ చేపట్టారు. వీఓఏ అక్రమంగా డబ్బులు వాడుకున్నట్లు తేలింది. రికవరీకి ఆదేశించారు.

– దుర్గాప్రసాద్, ఏపీఎం, పాలకవీడు మండలం

• పీర్ల ఊరేగింపు



మొహర్రం సందర్భంగా ఆదివారం సూర్యాపేట పట్టణంలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాగర్‌కు తరలిరానున్న కృష్ణమ్మ

- ఎగువన భారీగా వరద నీటి ప్రవాహం
- రేపు శ్రీశైలం క్రస్ట్ గేట్ల ఎత్తివేతకు సిద్ధమైన అధికారులు
- సాగర్ జలాశయంలో పెరగనున్న నీటిమట్టం



సాగర్ జలాశయం

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయానికి ఈ ఏడాది జూలై మొదటి వారంలోనే కృష్ణమ్మ తరలివస్తోంది. ఈ ఏడాది కృష్ణానదికి ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణానదిలో వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి నీటి రాక పెరగడంతో శ్రీశైలం జలాశయం నీటిమట్టం గరిష్టస్థాయి చేరువలో ఉంది. దీంతో మంగళవారం (8న) శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తేందుకు ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. శ్రీశైలం గేట్లెత్తితే ఆ నీరంతా నాగార్జునసాగర్ జలాశయానికి చేరుకోనుంది.

ఎగువ ప్రాజెక్టుల్లో జలకళ

కృష్ణానదిపైన కర్నాటక, మహారాష్ట్రలోని జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. ఇప్పటికే దీంతో అదనంగా వస్తున్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎగువన గల జూరాల జలాశయం ఈ ఏడాది మే నెలలో కురిసిన వర్షాలకు గరిష్ట స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. జూన్‌లోనే రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం తుంగభద్ర ప్రాజెక్టు గరిష్ట స్థాయికి చేరడంతో మూడు రోజుల క్రితమే రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తారు. దీంతో ఇటు జూరాల, అటు తుంగభద్ర నుంచి శ్రీశైలానికి లక్షన్నర క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టం 885.00అడుగులు (215.807 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 879.30అడుగులు (184.2774 టీఎంసీలు)గా ఉంది. ఇప్పటికే శ్రీశైలం కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 67,740 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం పెరుగుతోంది. సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 527.00 అడుగులు (162.3490 టీఎంసీలు)గా ఉంది.

జూన్ 12 నుంచే నీటిరాక..

సాగర్ కనీస నీటిమట్టం 510.00 అడుగులు. కాగా గతేడాది ఇదే రోజున కనీస నీటిమట్టానికి దిగువన 503.80అడుగులు (120.8990 టీఎంసీలకు)గా ఉంది. జూలై 24 వరకు అలాగే కొనసాగింది. 25వ తేదీ నుంచి శ్రీశైలం నుంచి విద్యుదుత్పాదన ద్వారా నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వరద పెరగడంతో జూలై 29వ తేదీన శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తి సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేశారు. ఆగస్టు 5వ తేదీన సాగర్ జలాశయం రేడియల్ క్రస్ట్ గేట్లెత్తి దిగువకు నీటిని వదిలారు. ఈ ఏడాది సాగర్ జలాశయం కనీస నీటిమట్టానికి వెళ్లలేదు. 511 అడుగుల వద్ద ఆగింది. ఈ ఏడాది జూన్ 12వ తేదీ నుంచే శ్రీశైలం జలాశయం నుంచి విద్యుదుత్పాదన ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తూ వచ్చారు. క్రమంగా సాగర్ జలాశయం నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. ఇదే రీతిలో ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగితే ముందస్తుగానే క్రస్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉంటుంది.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

కోదాడరూరల్ : పెంపుడు జంతువులున్న ప్రతిఒక్కరూ వాటికి రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో ×జూనోసిస్ డే×పురస్కరించుకొని పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇళ్లల్లో పెంచుకొనే కుక్కలు, పిల్లులు వంటి జంతువులకు వాటి యజమానులు టీకాలు వేయించాలన్నారు. రేబిస్ వ్యాధికి చికిత్స లేదని, ముందుస్తు టీకాలు వేయించడమే మార్గమన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య, డాక్టర్ పురేంద్ర, డాక్టర్ వినయ్, సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్‌కర్ణ తదితరులు ఉన్నారు.



కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

మట్టపల్లిలో తొలి ఏకాదశి వేడుకలు



శ్రీస్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

- ప్రత్యేక పూజలు చేసిన కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం తొలిఏకాదశి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో మట్టపల్లికి చేరుకుని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీస్వామివారిని, క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మట్టపల్లి క్షేత్రాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఆమెకు ఆలయ సంప్రదాయ పద్ధతులతో ఆహ్వానించారు. అనంతరం ధర్మకర్తలు, అర్చకులు ఆమెను సన్మానించారు. ఆలయ అభివృద్ధి పనులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

క్లుప్తంగా

సాగర్ వెనుక జలాల్లో మునిగి యువకుడి మృతి

చందంపేట: నేరేడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీలో సాగర్ వెనుక జలాల్లో మునిగి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. హైదరాబాద్‌లోని లింగంపల్లికి చెందిన మచ్చూరి అనిల్‌కుమార్(26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. నలుగురితో కలిసి అనిల్‌కుమార్ శనివారం వైజాక్ కాలనీని సందర్శించేందుకు వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున స్నానం చేసేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగి నీట మునిగి గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు అనిల్‌కుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని..


గుర్తుతెలియని మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): విజయవాడ–హైదరాబాద్ హైవే పై చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామ స్టేజీ వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి(35) హైవే దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712686031 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

బైక్‌లు చోరీ చేస్తున్న మైనర్

- జువైనల్ హోంకు తరలింపు

మోత్కూరు: బైక్‌లు చోరీ చేస్తున్న బాలుడిని మోత్కూరు పోలీసులు అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు పట్టణానికి చెందిన మత్స్యగిరి, వేమల్‌రెడ్డి తమ బైక్‌లు చోరీకి గురైనట్లు జూన్ 29న మోత్కూరు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. తన దగ్గర సెంట్రింగ్ పని చేసేందుకు వచ్చిన బాలుడు తన బైక్ దొంగిలించాడని మత్స్యగిరి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మత్స్యగిరి ఫిర్యాదులో పేర్కొన్న బాలుడు మోత్కూరు కొత్త బస్టాండ్ వద్ద శనివారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. రెండు బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దొంగిలించిన బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడు మైనర్ అయినందున జువైనల్ హోంకు తరలించారు.

ఎర్ర జెండాలు పాతి స్థలం స్వాధీనం


స్థలం స్వాధీనం చేసుకున్న లబ్ధిదారులు

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలోని సర్వే నంబర్ 700లో 2005లో ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించిన స్థలంలో ఆదివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఎర్ర జెండాలు పాతి గుడిసెలు వేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ.. 2005లో పేదలకు కాగితాలు ఇచ్చి 20 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇంకా ఇంటి స్థలాన్ని కేటాయించలేదని ఆరోపించారు. లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరిగినా స్పందించకపోవడంతో గుడిసెలు వేసినట్లు తెలిపారు. భువనగిరి పట్టణంలో ఎంతోమంది ఇళ్లు లేని పేదలు ఉన్నారని.. అర్హులకు ఇంటి స్థలం చూపించి ఇళ్ల నిర్మాణం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు గంధమల్ల మాతయ్య, కల్లూరి నాగమణి, బర్లవెంకటేశం, వల్దాస్ అంజయ్య, రాహుల్, రియాజ్, సాజిత్, నరాల నరసింహ, కొత్త లలిత, కొత్త లక్ష్మయ్య, అరుణ, మంజుల, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కల సాకారమయ్యేనా..?

- బాసర ఆర్‌జీయూకేటీకి అనుబంధంగా రాష్ట్రంలో క్యాంపస్‌ల విస్తరణ
- ఈ ఏడాది మహబూబ్‌నగర్‌లో క్యాంపస్ ప్రారంభం
- అందులో కొనసాగుతున్న అడ్మిషన్లు
- వచ్చే ఏడాది హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో మరో క్యాంపస్ ప్రారంభించే అవకాశం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని డిమాండ్


బాసరలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్

రామన్నపేట: ఉమ్మడి జిల్లాలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ కలగానే మిగిలిపోతుంది. తెలంగాణ రాష్ట్రంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి జిల్లా ఉన్నత విద్యాసంస్థల పరంగా కొంత వెనుకబడే ఉందని చెప్పవచ్చు. విద్యాసంస్థల ఏర్పాటు పరంగా వెనుకబడిన నల్లగొండ జిల్లాలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతంలో అప్పటి ఆదిలాబాద్ జిల్లాలోని (ప్రస్తుతం నిర్మల్ జిల్లా) బాసరలో, కోస్తా ఆంధ్రా ప్రాంతంలో అప్పటి కృష్ణా జిల్లాలోని(ప్రస్తుతం ఏలూరు జిల్లా) నూజివీడులో, రాయలసీమలో కడప జిల్లా ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మెరిట్ ఆధారంగా ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపిక సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 24 మార్కులను లేదా 0.4 జీపీఏ కలిపి మెరిట్ తీస్తారు. తెలంగాణలో బాసరలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జీయూకేటీ)లో ప్రతి సంవత్సరం 1500 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు ప్రీ యూనివర్సిటీ కోర్సును(ఇంటర్ సమానం)అభ్యసిస్తారు. పీయూసీ కోర్సులో సాధించిన మెరిట్ ఆధారంగా బీటెక్ కోర్సులో ప్రవేశం కల్పిసారు.

మరో రెండుచోట్ల ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు

బాసరలోని ఆర్‌జీయూకేటీకి అనుబంధంగా ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి ప్రాధాన్యతగా మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గుచూపింది. క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి 2025–26 విద్యాసంవత్సరం ప్రవేశాల కొరకు నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది. మొదటి విద్యాసంవత్సరంలో 181మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తూ ఈ నెల 4న ఎంపిక జాబితాను ప్రకటించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఎంపికైన విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. వచ్చే విద్యాసంవత్సరం హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో మరో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మార్చి నెలలో ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను క్యాంపస్ ఏర్పాటు కోసం పరిశీలించినట్లు తెలుస్తోంది.

నల్లగొండకు అవకాశం దక్కేనా..?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మహత్మాగాంధీ విశ్వవిద్యాలయం మినహా పేరొందిన ప్రభుత్వ విద్యాసంస్థలు పెద్దగా ఏమీ లేవు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు కూడా అంతంతమాత్రమే. సాంకేతిక విద్యను అభ్యసించడానికి ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయి. ఇతర జిల్లాల విద్యార్థులు వచ్చిపోవడానికి అనువైన జాతీయ రహదారులు, రైల్వే లైన్లు కూడా ఉన్నాయి. తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్‌లో గల ఎంజీ యూనివర్సిటీ తాత్కాలిక భవనాలను ఉపయోగించవచ్చు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులుగా కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లాలోని 12మంది ఎమ్మెల్యేల్లో 11మంది అధికారపక్షానికి చెందిన వారే కాగా.. అందరూ సమష్టిగా కృషి చేసి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఉమ్మడి జిల్లాకు సాధించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

మనసున్న మారాజులు ఆదుకోరూ..

- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన ఇంటి పెద్ద
- భారంగా మారిన కుటుంబ పోషణ

కన్నీటి గాథ


మంచానికే పరిమితమైన మేడిపల్లి శంకర్

నార్కట్‌పల్లి: కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. వివరాలు.. నార్కట్‌పల్లి మండలం తొండల్‌వాయి గ్రామానికి చెందిన మేడిపల్లి నర్సింహకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వారిలో ఒక కుమారుడు మృతిచెందగా.. మరో కుమారుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న కుమారుడు మేడిపల్లి శంకర్ 20ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే కుల వృత్తిలో భాగంగా సెలూన్ షాపులో పనిచేస్తున్నాడు. ఆ సమయంలో హైదరాబాద్‌లోనే లక్ష్మిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అద్దె ఇంట్లో ఉంటున్నారు.

రెండేళ్ల నుంచి అనారోగ్యంతో..

మేడిపల్లి శంకర్ రెండేళ్ల క్రితం మెడ నరాల నొప్పితో డాక్టర్ వద్దకు వెళ్లగా.. మెడ నరాలకు కండ పెరిగిందని వైద్యులు తెలిపారు. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుని, సొంతూరు తొండల్‌వాయికి వచ్చారు. స్వగ్రామంలో ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో దిగారు. కొన్నిరోజుల తర్వాత శంకర్ నడుచుకుంటూ వెళ్తుండగా.. కిందపడడంతో తుంటి ఎముక పక్కకు తొలగింది. ఫిజియోథెరపీ చేయించుకున్నా అది సరికాకపోవడంతో డాక్టర్లను సంప్రదించాడు. డాక్టర్లు పరిశీలించి ఆపరేషన్ చేస్తే ఎముక సరైన స్థానానికి వస్తుందని, ఆపరేషన్‌కు రూ.4లక్షలు అవుతాయని చెప్పగా.. డబ్బులు లేక ఆపరేషన్ చేయించుకోకుండా ఆగిపోయాడు. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం అతడి కుమార్తె ఇంటర్, కుమారుడు పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. శంకర్ భార్య కూలీ పనికి వెళ్లగా వచ్చే డబ్బులతో కుటుంబం గడుస్తోంది. తమకు ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదని, ఇతర ప్రభుత్వ పథకాలు అందడంలేదని, మనసున్న మారాజులు ఆపన్న హస్తం అందిస్తే శంకర్‌కు ఆపరేషన్ చేయిస్తామని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

వేదాలకు నిలయంగా యాదగిరి క్షేత్రం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


ప్రాకారం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఐలయ్య, చిత్రంలో ఈఓ వెంకట్రావ్ తదితరులు

యాదగిరిగుట్ట: వేదాలకు నిలయంగా ఉండాలని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం చెంత వేద పాఠశాలను సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం యాదగిరి కొండకు సమీపంలో ఉన్న టెంపుల్ సిటీపై నిర్మించనున్న వేద పాఠశాల చుట్టూ ప్రాకారం(ప్రహరీ) ఏర్పాటు చేసేందుకు ఈఓ వెంకట్రావ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.46కోట్లతో వేద పాఠశాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వేద పాఠశాల ప్రాకారం నిర్మాణానికి శంకుస్థాపన చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. యాదగిరి క్షేత్రం అభివృద్ధితో పాటు భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి దృఢంగా సంకల్పిస్తున్నారన్నారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వేద పాఠశాల నిర్మాణం చేసే స్థలంలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ వెంకట్రావ్, ఆలయాధికారులు, అర్చకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యుల అరెస్ట్

- 17 తులాల బంగారం, 79 తులాల వెండి, 2కిలోల గంజాయి, బైక్ స్వాధీనం
- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: గంజాయి సేవిస్తూ జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను ఆదివారం నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. హైదరాబాద్‌లోని నాగోల్ ప్రాంతానికి చెందిన గాజుపల్లి జోసఫ్, బోస్, ఎరిక్ విల్సన్ మెరినా, ఒరిస్సాకు చెందిన మాలిక్‌తో పాటు మరో ఇద్దరు బాలురు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు జల్సాలకు అలవాటు పడి రాత్రివేళ తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. గత నెల 30న నార్కట్‌పల్లిలోని రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి గాలి యాదయ్య ఇంట్లో చోరీకి పాల్పడి 22 తులాల బంగారం, 80 తులాల వెండి అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నార్కట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో కలిసి నార్కట్‌పల్లి శివారులోని ఓ వెంచర్‌లో ఇద్దరు బాలురతో పాటు ఎరిక్ విల్సన్ మెరినా, గాజుపల్లి జోసఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 17 తులాల బంగారం, 79 తులాల వెండి, 2 కిలోల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు బోస్, మాలిక్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించిన నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, ఏఎస్‌ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి మహిళ మృతి

మఠంపల్లి: ట్రాక్టర్‌పై నుంచి జారిపడి మహిళ మృతిచెందింది. ఈ ఘటన మఠంపల్లి మండల కేంద్రం సమీపంలోని రామస్వామి కుంట వద్ద రఘునాథపాలెం రోడ్డుపై ఆదివారం జరిగింది. మఠంపల్లి ఎస్‌ఐ పి. బాబు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ఆలకుంట్ల నవనీత(30) ఆదివారం మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో ఇంటి స్లాబు వేసేందుకు కూలీలతో కలిసి ట్రాక్టర్‌పై వచ్చింది. తిరుగు ప్రయాణంలో మఠంపల్లి మండల కేంద్రం సమీపంలో రామస్వామి కుంట మూలమలుపు వద్దకు రాగానే ఆమె ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందింది. ఈ ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వర్ణగిరీశుడికి నవ కలశ పంచామృతాభిషేకం

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున స్వామివారికి ఆలయ అర్చకులు నవ కలశ పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, మేల్ చాట్‌వస్త్ర సేవ, లక్ష తులసీ సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం, మధ్యాహ్నం సుమారు 5వేల మంది భక్తులకు అన్నదానంచేశారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో తిరువీధి ఉత్సవ సేవ, మహా మంగళహారతులు సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. మేల్ చాట్ వస్త్ర సేవ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపికృష్ణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


స్వామి వారికి పంచామృత అభిషేకం చేస్తున్న అర్చకులు

ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


విలేకరులతో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: రైతులకు కనీసం ఎరువులు కూడా ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. కేతేపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతులు చెప్పులు లైన్‌లో పెట్టి ఎరువులు తెచ్చుకునే రోజులు రాష్ట్రంలో కనిపిస్తున్నాయన్నారు. రైతులకు సరిపోను ఎరువులు సరఫరా చేయలేక అధికారులు చేతులెత్తేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సకాలంలో పంట పెట్టుబడి సాయం అందించడంలో విఫలమైందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం పంటల సాగుకు ముందే మూసీ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు బంటు మహేందర్, కొండ సైదులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో సందర్శకుల సందడి


మినీ శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు సమీపంలో గల మినీ శిల్పారామంలో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చిన భక్తులు మినీ శిల్పారామాన్ని కూడా సందర్శించి బోటులో విహరిస్తూ ఆనందంగా గడిపారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కూడా తన కుటుంబ సభ్యులతో కలిసి శిల్పారామాన్ని సందర్శించారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో చిన్నారులతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

చిన్నారి హర్షిత మృతదేహం లభ్యం

- తల్లి, కుమార్తె అంత్యక్రియలు పూర్తి


చిన్నారి హర్షిత మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న తాత శంకరయ్య

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో శనివారం కుమార్తెతో కలిసి వ్యవసాయ బావిలో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడగా.. ఆదివారం చిన్నారి మృతదేహం లభ్యమైంది. వివరాలు.. వంగమర్తి గ్రామానికి చెందిన వాణి(23)కి రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన సింగారపు మహేశ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. నెల రోజుల క్రితం చిన్న కుమార్తె హర్షిత(8 నెలలు)తో కలిసి వాణి వంగమర్తిలోని తల్లిగారింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. మానసికస్థితి సరిగా లేని వాణి శనివారం చిన్నారి కుమార్తె హర్షితతో కలిసి గ్రామ సమీపంలోని నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. శనివారం సాయంత్రం వాణి మృతదేహం లభ్యం కాగా.. ఆదివారం చిన్నారి హర్షిత మృతదేహం బావిలో తేలియాడుతూ కనిపించింది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామన్నపేట మండలం ఎన్నారం గ్రామంలో ఆదివారం సాయంత్రం వాణి, చిన్నారి హర్షిత అంత్యక్రియలు జరిగాయి.

అపరాల సాగులో చీడపీడలు, నివారణ మార్గాలు

పాడిపంట


గుర్రంపోడులో సాగవుతున్న పెసర (ఇన్‌సెట్లో ఆకుమచ్చ తెగులు)

గుర్రంపోడు: వానాకాలం సీజన్‌లో వరి సాగుకు ముందు చాలామంది రైతులు మినుము, పెసర సాగుచేస్తుంటారు. అంతేకాకుండా పండ్ల తోటల్లో అంతరపంటగా సాగు చేసే పెసర, మినుము పంటల్లో చీడపీడల నివారణకు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ పంటల విషయంలో ఎరువుల యాజమాన్యం, మినుము, పెసర పంటలకు సోకే పురుగులు, తెగుళ్లు.. వాటి నివారణపై గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి అందిస్తున్న సలహాలు, సూచనలు..

❖ చిత్త పురుగు

ఈ పురుగు రెండు ఆకుల దశలో ఎక్కువగా ఆశించడం వల్ల మొక్కల్లో పెరుగుదల లేక లేత మొక్కలు చనిపోతాయి. చిత్త పురుగులు సాయంత్రం, రాత్రి వేళ ఆకులను తిని నష్టపరుస్తాయి. ఆకులపై గుండ్రని రంధ్రాలు గమనించడం వల్ల చిత్తపురుగుల ఉనికిని గుర్తించవచ్చు. చిత్త పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి రెండు గ్రాముల మోనోక్రోటోఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

❖ కాండపు ఈగ

ఈ పురుగు తొలిదశలో సుమారు 30 రోజుల వరకు మాత్రమే నష్టం కలిగిస్తుంది. కాండపు ఈగ ఆశించిన మొక్కల్లో తల చివరి ఆకులు వడలిపోతాయి. లేత మొక్కలు పసుపురంగుకు మారి మొక్క ఎండిపోతుంది. భూమికి దగ్గరగా మొక్క మొదలు దగ్గర కాండం ఉబ్బి మొక్కలు గిడసబారి ఎండిపోతాయి. నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

❖ తామర పురుగులు

తామర పురుగులు ఆశించిన మొక్కల్లో పెరుగుదల తగ్గి గిడసబారిపోతాయి. తామర పురుగులు ఆకుల నుంచి రసం పీల్చడమేగాకుండా ఆకుముడత అనే వైరస్ వ్యాధిని కలుగజేస్తుంది. దీని నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటికి లేదా ఫిప్రొనిల్ ఒక మిల్లీలీటరు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

❖ తెల్లదోమ

తెల్లదోమ రెక్కల పురుగులు, పిల్ల పురుగులు ఆకుల అడుగుభాగం నుంచి రసం పీల్చడం వల్ల ఆకుల ముడతలు పడి క్రమేపీ ఎండి రాలిపోతాయి. తెల్లదోమ సోకిన మొక్కలు అడుగుభాగంలో గల ఆకులపై నల్లటి బూజు ఏర్పడి కిరణజన్య సంయోగక్రియ సరిగా జరగకపోవడం వల్ల మొక్కల్లో పెరుగుదల ఆగిపోతుంది. ఈ పురుగులు ఆకుల్లోని రసాన్ని పీల్చడమేగాకుండా కాకపల్లాకు తెగులును, వైరస్ తెగులును వ్యాపింపజేస్తాయి. దీని నివారణకు 1.5 మిల్లీలీటరు ట్రైజోఫాస్ మందును లేదా ఒక గ్రాము ఎసిఫేట్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

❖ మారాకు మచ్చల పురుగు

తల్లి పురుగు పూ మొగ్గలపై, ఆకులపై, పిందెలపై 2–16 గుడ్ల సముదాయంగా పెడుతుంది. గుడ్ల నుంచి 4–5 రోజుల్లో పిల్ల పురుగులు వెలుపలికి వస్తాయి. లార్వాలు పురుగు మొగ్గ, పూత పిందె దశల్లో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తాయి. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటాయి. కాయలకు రంధ్రం చేసి లోపలికి గింజలనపు తినడం వల్ల పంటలకు ఎక్కువ నష్టం కల్గిస్తుంది. మారాకు మచ్చల పురుగు నివారణకు పూతకు ముందే 5 శాతం వేపగింజల కషాయం లేదా లీటరు నీటికి 2.5 మి.లీ క్లోరోపైరిఫాస్ లీటరునీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ ఆకుమచ్చ తెగులు

ఈ తెగులు సోకిన ఆకులపై చిన్నచిన్న గుండ్రని మచ్చలు ఏర్పడి పెద్ద మచ్చలుగా మారి ఆకులు ఎండి రాలిపోతాయి.

పొగాకు లద్దె పురుగు

ఈ పురుగులు ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని గీకి తినడం వల్ల ఆకులు తెల్లగా కనిపిస్తాయి. ఆకులకు రంధ్రాలు చేసి ఆకులను పూర్తిగా, పూలను, పిందెలను తింటాయి. ఈ పురుగులు రాత్రిపూట ఎక్కువగా తింటూ పగలు మొక్కల మొదళ్లలో చేరుతాయి. దీని నివారణకు గుడ్ల సముదాయం ఏరివేయాలి. ఎకరానికి 10 లింగాకర్షణ బుట్టలు పెట్టి తల్లిపురుగుల ఉధృతిని గమనించాలి. ఈ పురుగు తొలిదశలో మోనోక్రోటోఫాస్ 1.5 మందు లీటరు నీటికి కలిపి మొక్కలు తడిచేలా పిచికారీ చేయాలి. పురుగులు పెద్దవై ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు సాయంత్రం వేళ విషపు ఎరలను 5కిలోల తవుడు, అరకిలో బెల్లం, 1.5 లీటరు మోనోక్రోటోఫాస్ మందు కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసి ఉంచి పురుగులను నివారించుకోవాలి.

❖ బూడిద తెగులు

విత్తిన 30–35 రోజుల తర్వాత గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ముదరు ఆకులపై బూడిద రూపంలో చిన్న చిన్న మచ్చలు పడి అవి క్రమేణా ఆకులపైనా క్రింది భాగాలకు కొమ్మలకు కాయలకు వ్యాపిస్తాయి.

❖ నివారణ చర్యలు

పెసర, మినుము పంటలో ఆశించే ఆకుమచ్చ, బూడిద తెగుళ్ల నివారణకు 30 నుంచి 35 రోజుల దశల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చు.